# దివ్యవనాలు - విశిష్టత

38వ భాగం

జె. వేణిమాధవి
నేచురలిస్ట్
www.vedicvanas.com



(నవంబరు సంచిక తరువాయి)

## సరస్వతీ వనం



**తల్లీ నిన్ను దలంచి పుస్తకము చేతన్ బూనితిన్
నీవునా యుల్లంబందున నిల్చి జృంభణముగా సుక్తుల్ సుశబ్దంబు
శోభిల్లన్ బల్కుము నాదు వాక్కునను సంప్రీతిన్ జగన్మోహినీ
పుల్లాబ్జాక్షి సరస్వతీ భగవతీ పూర్ణేందు బింబాననా॥**

ఇప్పటివరకూ మనం సరస్వతీదేవికి ప్రీతిపాత్రమైన మూడు పుష్పాల గురించి తెలుసుకున్నాం. అవి నందివర్థనం, మల్లెపువ్వులు, పచ్చగన్నేరు పువ్వులు. ఆ చదువుల తల్లి చైతన్యాన్ని ప్రతిబింబించే మరొక పుష్పం మనకి సుపరిచితమైన పొగడ పువ్వులు.

### 4. పొగడ పువ్వులు

పొగడ చెట్లు భారతదేశం, ఆఫ్రికా, శ్రీలంక, చైనా దేశాల్లో సహజ సిద్ధంగా పెరుగుతాయి. మనదేశంలో పొగడచెట్టుని ఎంతో పవిత్రమైన దిగా భావిస్తారు. ఇది ముదురాకుపచ్చ ఆకులు కలిగి చక్కటి నీడ నిస్తుంది. ఇది సపోట జాతికి చెందినది. మన ప్రాంతంలో ఈ చెట్లను రోడ్లవెంబడి నీడకోసం వేస్తూంటారు. మన రాష్ట్ర సచివాలయ భవనం వెలుపల ఈ చెట్లు విరివిగా కనిపిస్తాయి.







| | | |
|---|---|---|
| సంస్కృత నామాలు | : | వకుళ, శారధిక, గంధపుష్పక, సింహకేసర, స్త్రీముఖ గంధ, మధుపుష్ప మొ॥నవి |
| శాస్త్రీయనామం | : | Mimusops Elengi |
| ప్రాంతీయ నామం | : | పొగడ, బొగడ, వకుళము, కేసర మొ॥నవి |
| ఆంగ్ల నామాలు | : | Bullet-wood tree, Spanish cherry, Indian Medlar |

### ఔషధ గుణాలు

* పొగడ ఆకులు, పువ్వులు కాండం, కాయలు అన్నీ కూడా ఔషధీ గుణాలు కలిగిఉంటాయి.
* ఆసియా ఖండంలోని పలు ప్రాంతవాసులు దీని ఆకులను తల నొప్పి, పంటినొప్పి, కండ్ల కలకలు మొదలగు వ్యాధులను తగ్గించు కోవడానికి వాడతారు.







* వీటి పొగను కొన్నిరకాల ముక్కు, నోటివ్యాధుల నివారణకు పీలుస్తారు.
* పొగడచెట్టు బెరడు కషాయాన్ని పుండ్లు, విరోచనాలు, చిగుళ్ళ వాపు, చర్మవ్యాధులు వంటి పలురకాల సమస్యల నివారణకు వినియోగించడాన్ని చూడవచ్చు.
* దీని బెరడులో రక్తప్రసరణ వ్యవస్థలోని లోపాలను నియంత్రించే రసాయనాలు వున్నాయి.
* వీటి గింజల పొడిని తీవ్రస్థాయిలో వున్న మలబద్ధకాన్ని తగ్గించేం దుకు వాడతారు.
* చిన్న ప్రేగులు పోషకాలను గ్రహించలేకపోవడం వంటి లోపాల్ని



సజ్జనుల సేవ చేయడం ద్వారా భగవంతుడిని చేరుకోవచ్చు.

సరిచేసే గుణం వీటి లేతకాయలకు వుంది.

* ఇది 'హైడ్రోఫోబియా' అంటే నీటిని చూసి భయాందోళనలు చెందే లక్షణాన్ని నయం చేస్తుంది.

## ఇతర ఉపయోగాలు

* పండిన పొగడ కాయలను కొన్ని ప్రాంతాలవారు తింటారు. ఇవి ఈతకాయల రుచిని పోలి వుంటాయి.
* పొగడచెట్టు నుండి లభించే కలప చాలా గట్టిది. దీనిని ఓడల నిర్మాణం నుంచి బొమ్మలు, గృహోపకరణాల తయారీవరకూ వివిధ రకాలుగా వినియోగిస్తుంటారు.
* కొన్ని ప్రాంతాల్లో దీన్ని వాణిజ్యపరంగా పెంచి ఎగుమతి చేస్తుంటారు.
* వీటి గింజల నుంచి నూనెను సేకరించి, దాన్ని వంటకి ఉపయోగిస్తుంటారు.
* పువ్వులలో లభ్యమయ్యే పరిమళభరిత రసాయనాలను వివిధ సుగంధద్రవ్య ఉత్పత్తులలో వినియోగిస్తుంటారు.

## స్త్రీలకు వరం

* పూర్వం రోజుల్లో ఆడపిల్లలు, సాయంసంధ్యవేళ చెట్టుకింద రాలిన పువ్వులను సేకరించి మాలలు చేసి, దేవుడికి అలంకరించడం సర్వసాధారణంగా జరిగేది.
* వారు కూడా పూలజడలు వేయించుకోవడం కోసం సరదా పడుతూండేవారు. వీటిలోని సుగంధాలు కురులకు పట్టుకొని ఆ వారమంతా ఆ సువాసనలు వెదజల్లడం విశేషంగా భావించేవారు.
* మరికొందరు మరుసటిరోజు ఈ పూలమాలలను వారి బట్టల మధ్య పెట్టి వాటి సువాసనలను మరిన్నిరోజులు ఆస్వాదిస్తూంటారు.
* కొన్నిప్రాంతాలవారు వీటిని తలగడల్లో కూడా పెట్టుకొంటూంటారు.
* ఇక ఆయుర్వేద వైద్యపరంగా చూస్తే ఇది స్త్రీలలో సంతానోత్పత్తి శక్తిని పెంపొందిస్తుంది.
* అంతేకాకుండా సుఖప్రసవానికి కూడా తోడ్పడుతుంది.
* దీనికి మానసిక రుగ్మతలను నయంచేసే గుణం కూడా వుండటం విశేషం.







* అప్పటిరోజుల్లోని ఇళ్ళు, వాటి పరిసరాలు సహజసిద్ధమైన పరిమళాలను గుబాళిస్తుండేవి.

ఈ ప్రకృతి పరిమళాలు ఎల్లవేళలా వారికి ప్రశాంతమనస్సు, సదాలోచన, సత్ప్రవర్తన, సమతుల్యమైన ఆలోచనలు మొదలైన వాటి వైపు మలుస్తూండేవి. పనివల్ల కలిగిన శ్రమ ఒత్తిడుల నుండి వారికి హాయిని, ఉపశమనాన్ని కలిగించేవి. ఇవన్నీ వారి ఎరుక లేకుండానే సహజంగా జరిగిపోయేవి.

## విశేష గుణాలు

* **వకుళమాత** : ఈ దివ్యవృక్షం సాక్షాత్తూ శ్రీ వేంకటేశ్వరస్వామి తల్లి అయిన వకుళమాత ప్రతిరూపం. ఈ వృక్షం ఆ అమ్మ చల్లదనం, కరుణ, ప్రేమ అమృతత్వంతో ఉప్పొంగుతూ ఈ జగత్తంతటికీ ఆమె దీవెనలను అందిస్తుంది.





*తిరుమలలోని అన్నదానశాలలోని శ్రీ వకుళమాత*

* **మలయప్ప స్వామి** : పొగడమాలలతో తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని అలంకరిస్తూంటారు. చాలా సునిశితంగా పరిశీలిస్తే స్వామికి సంధ్యవేళలో చేసే సహస్ర దీపాలంకరణ సేవ సమయంలో ఈ సన్నని మాలలను మనం గమనించవచ్చు.

సామాన్యంగా పువ్వుల పరిమళం కొన్ని గంటలపాటు మాత్రమే వుంటుంది. కానీ ఈ పొగడపువ్వుల సువాసన అవి వికసించిన రెండు వారాల వరకూ వుండటం విశేషం.







ధర్మాన్ని తెలుసుకున్నంత మాత్రాన ఫలితం లేదు. దాన్ని ఆచరిస్తేనే ఫలితం దక్కుతుంది.



## సిద్ధ బ(వ)కుళ

శ్రీకృష్ణ పరమాత్మ స్వయంగా కొలువుతీరివున్న పరమ పవిత్రమైన పూరీ పట్టణంలో అత్యంత విశేషమైన పొగడచెట్టు వుంది. దాని పేరు 'సిద్ధ బ(వ)కుళ'. 15వ శతాబ్దం నాటి ఈ దివ్యవృక్షం విశేషాల్ని సంక్షిప్తంగా తెలుసుకొందాం.

శ్రీ చైతన్య మహాప్రభువు ముఖ్య అనుయాయుల్లో శ్రీహరిదాస ఠాకూర్ అనే భక్తుడు ఒకరు. ఈయన ఒక ముస్లిం అయివుండి హిందువుగా మారాడు. అయినా అతడికి జగన్నాథుడి ఆలయంలోకి ప్రవేశించే అనుమతి ఇవ్వలేదు. మొఘలు అధికారుల నుండి అనేక అవమానాలు, పరీక్షలు, శిక్షలను అతడు ఎదుర్కొనవలసివచ్చింది. ఆ పరిస్థితుల్లో శ్రీ చైతన్యమహా ప్రభువు వీరిని చేరదీసి జగన్నాథుని ఆలయ గోపురం కనిపించేలా వున్న ఒక తోట వద్ద ఆశ్రయం కల్పించారు. ప్రతినిత్యం పూరీ జగన్నాథుడి పవిత్రప్రసాదం అందేలా ఏర్పాటు చేయించారు.

హరిదాస ఠాకూర్ ప్రతిరోజూ 'హరే రామ హరే రామ రామ రామ హరే హరే, హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే' అనే దివ్యనామాన్ని భక్తిశ్రద్ధలతో మూడులక్షలసార్లు జపించేవాడు.







ప్రతిరోజూ పూరీ జగన్నాథుడికి సమర్పించే వివిధ వస్తువుల్లో పళ్ళు తోము కోవటానికి ఉపయోగించే పుల్ల కూడా ఒకటి. ఒకరోజు జగన్నాథుడికి అనివార్య కారణాల వల్ల వేపపుల్లకు బదులు పొగడ పుల్లను సమర్పించడం జరిగింది. తదనంతరం దానిని ఒక పూజారి శ్రీ చైతన్య మహా ప్రభువుకు ఇవ్వటం తటస్థించింది. ఆయన దాన్ని హరిదాస ఠాకూర్ కుటీరం వద్ద నాటారు. అది త్వరితగతిన మహా వృక్షంగా ఎదిగి ఆయనకు నీడను ఇవ్వసాగింది. హరిదాస ఠాకూర్ ప్రతినిత్యం ఈ చెట్టునీడన కూర్చుని సంకీర్తన చేసుకోవడం, శ్రీ చైతన్య ప్రభువు, రూపా గోస్వామి, సనాతన గోస్వామి, గౌరంగ వంటి సాధువులు దీని వద్ద దివ్యనామ సంకీర్తనలను, సత్సంగాలను చేయడం విశేషం.









*శ్రీల హరిదాస ఠాకూర్ ప్రతిరోజు మూడులక్షలసార్లు శ్రీకృష్ణ నామ సంకీర్తన సత్సంగాలు చేసిన పవిత్ర ప్రదేశం*

ఇది గిట్టని కొందరు ముస్లింలు ఆయన్ను ఎన్నో రకాలుగా అవమానపరచే ప్రయత్నాలను చేసారు. వేశ్యలను పంపారు. నిందలు మోప ప్రయత్నించి విఫలమయ్యారు. అలా కొన్ని సంవత్సరాలు గడిచిన తర్వాత ఒకరోజు శ్రీ హరిదాస ఠాకూర్ తన్మయత్వంతో సంకీర్తనను చేస్తూ శ్రీ చైతన్య ప్రభువు పాదాల చెంత ఇచ్ఛాపూర్వకంగా తనువు చాలించాడు.

శ్రీ చైతన్యుడు ఆయన శరీరాన్ని తన చేతుల్లోకి తీసుకొని ఊరేగింపుగా సముద్రతీరం వద్దకు తీసుకువచ్చి స్వయంగా అంత్య క్రియలు నిర్వహించాడు. ఆయనే స్వయంగా భిక్ష చేసి అన్నసంతర్పణని కూడా చేయడం జరిగింది.







అందర్నీ గుడ్డిగా నమ్మడం ఎంత తప్పో, ఎవర్నీ నమ్మకపోవడం కూడా అంతే తప్పు.






శ్రీ చైతన్యప్రభువు స్వయంగా భిక్ష చేసి, సంతర్పణ చేసిన దృశ్యం.

కొన్ని సంవత్సరాల తర్వాత అప్పటిరాజైన గజపతి మహారాజు ఏటా జరిగే జగన్నాథుడి రథోత్సవానికి తయారుచేసే రథం కొరకు ఆ పొగడచెట్టు కలపని సేకరించమని సేవకులను ఆదేశించడం జరిగింది. మరుసటిరోజే వారు వెళ్ళి చూడగా, దాని కాండం మొత్తం డొల్లగా మారి కలప సేకరించడానికి అనుకూలించక అందరినీ ఆశ్చర్య పరచింది.

ఆ వృక్షం సిద్ధి పొందిందని, ఆనాటినుంచి దాన్ని 'సిద్ధ వకుళ' అని పిలవసాగారు. దానికి రక్షణ కల్పించి మందిరాన్ని నిర్మించారు.







శ్రీల హరిదాస్ ఠాకూర్ సమాధి

దాని మొదలు డొల్లగా మారి మెలికలు తిరిగిపోయినా అది పచ్చని ఆకులతో కళకళలాడుతూండటం అందరినీ ఆశ్చర్యపరిచే విషయం.

## 500 ఏళ్ళనాటి సిద్ధ బ(వ)కుళ

ఆ దివ్యమైన, పవిత్రమైన పొగడ వృక్షం ఈనాటికీ జీవించి వుండి, దాని సమక్షంలో ధ్యానాదులు చేసే భక్తులకు దివ్యానుభూతులను అందిస్తోంది. ఆ సిద్ధవకుళ, ఆ వకుళమాత సాక్షాత్తూ ఆ పూరీ జగన్నా




థుడి స్పర్శ, చల్లని చూపు, చైతన్యాలను ప్రతిబింబిస్తూ, స్వయంగా శ్రీకృష్ణ పరమాత్ముని దీవెనలను మనకి అందిస్తోంది.

(శ్రీ చైతన్య చరితామృత, మధ్యలీల, 11 అధ్యాయం 157-203)

మనదేశంలోని మరిన్ని పవిత్ర వకుళ వృక్ష విశేషాల గురించి వచ్చే సంచికలో తెలుసుకొందాం.

*గమనిక : వైద్యుని సంప్రదించిన పిదపనే ఔషధులను సేవించమనవి.*



## శ్రీ చైతన్య మహాప్రభువు

ప్రఖ్యాతిపొందిన శ్రీకృష్ణ భక్తులలో క్రీ.శ. 1486-1543 కాలానికి చెందిన శ్రీ చైతన్య మహాప్రభువు ఒకరు. ఆనాటి సమాజంలో హిందూ ముసల్మానుల మత వైషమ్యాలు, అంటరానితనం, నాస్తికవాదం మొదలైనవి తీవ్రస్థాయిలో వుండేవి. ఆ పరిస్థితుల్లో ఈయన భక్తియోగం, హరినామ సంకీర్తనలను బహుళ ప్రాచుర్యంలోకి తీసుకొచ్చారు. వారు 'హరే రామ హరే రామ రామ రామ హరే హరే, హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే' అనే మహామంత్రాన్ని భక్తులకు అందించి భారతదేశమంతటా విస్తృతంగా పర్యటించి ప్రచారం చేసారు. శ్రీ చైతన్య మహా ప్రభువును బంగ్లాదేశ్, పశ్చిమబెంగాల్, ఒడిస్సా ప్రాంత ప్రజలు సాక్షాత్తు కృష్ణుడి అవతారమని భావిస్తారు. ఈయన ఆరంభించిన విప్లవాత్మకమైన ఈ హరినామ సంకీర్తనా ఉద్యమం నుంచే కాలక్రమంలో 19వ శతాబ్దంలో 'ఇస్కాన్' సంస్థ ఏర్పడింది.





శారీరకంగానే కాదు మానసికంగా ఎదుటివారిని బాధించినా అది హింసే అవుతుంది.